## క్లుప్తంగా

### నిస్వార్థ సేవకులను గుర్తించాలి



మాట్లాడుతున్న రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: నిస్వార్థ సేవకులను గుర్తించటం మనందరి బాధ్యతని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పొన్నాడ రవి కుమార్ అన్నారు. సంస్థ 20 ఆవిర్భా దినోత్సవాన్ని శ్రీకాకుళం నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని దివ్యాంగ పిల్లలకు, నిస్వార్థ సేవలందిస్తున్న సేవకులకు వస్త్రాలు అందించి చిరుసత్కారం చేశారు. బెహరా మనోవికాస కేంద్ర నిర్వాహకురాలు శ్యామల చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ శ్రీనివాస్, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, సభ్యులు బి.లక్ష్మణరావు, కన్వీనర్ పార్వతీశం, ట్రెజరర్ సింగూరు శ్రీనివాసరావు, సభ్యులు తర్లాడ అప్పలనాయుడు, ఉర్లం శివతేజ ఉన్నారు.

### దోమల నివారణకు చర్యలు



దవళపేటలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలం పరిధిలోని దవళపేట, విజయరాంపురం గ్రామాల్లో దోమల నివారణ మందును సర్పంచ్ వడిశ మహేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఫ్యాగింగ్ చేశారు. కాలువల్లో ఉన్న చెత్తాదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఉపసర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### షిర్డీసాయినాథునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో బొందిలీపురంలోని సాయిబాబా

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని సాయి దర్బార్‌లో షిర్డీసాయినాథునికి గురువారం సందర్భంగా ప్రత్యేక పుజలు జరిగాయి. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాకాడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేవారు. అలాగే రెల్లవీధిలోని షిర్డీసాయిబాబా మహాసమాధి శతయాబ్ది మందిరంలో కూడా స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మావుడూరి రాఘవశర్మ ఆధ్వర్యంలొ స్వామికి మూడు రకాల హారతులు, సత్సంగం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఓబీసీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అలపాన



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జ్యోతిరావు పూలే ఆలిండియా ఓబీసీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడుగా అలపాన త్రినాథరెడ్డి నియమితులయ్యారు. సంఘ అధ్యక్షులు పాతల ప్రసాద్ నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు సూచనలతో తనను ఉత్తరాంధ్ర సెక్రటరీ రౌతు శంకరరావు నియమించినట్లు త్రినాథరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### విధుల్లో చేరిన వైద్యాధికారి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ పి.సుధీర్‌కుమార్ గురువారం విధుల్లో చేరారు. ఈయన గతంలో కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారిగా వ్యవహరిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

### నేడు విద్యుత్ కోత

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం తెలిపారు. డి.మత్స్యలేశం, ఓలేటి అగ్రహారం, భగీరథపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. లోలుగు ఫీడర్‌లో మరమ్మతులు చేయనున్నారు. చిలకపాలెంలో శుక్రవారం ఉదయం 8 నుంచి 5 గంటల వరకు విద్యుత్ కోత అమలు చేయనున్నట్లు చెప్పారు.

**జి.సిగడాం మండలంలో..**

జి.సిగడాం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని ఏఈఈ తిరుపతిరావు తెలిపారు. ఆనందపురం, దవళపేట, పాలఖండ్యాం, సంతవురిటి, మెట్టవలసతో పాటు మరో ఐదు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తామన్నారు.

# అధ్వాన దారులతో అవస్థలు

- బురదమయంగా రహదారులు
- వాహనదారుల పాట్లు
- పట్టించుకోని అధికారులు



తోటపాలెం రోడ్డుపై తేలుతున్న పిక్క

ఎచ్చెర్ల క్యాంపస్:

ఇటీవల కురిసిన వర్షాలకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో రోడ్డులు అధ్వానంగా మారాయి. పలుచోట్ల రాళ్లు తేలాయి. మరికొన్ని చోట్ల గోతులు ఏర్పడ్డాయి. వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

- ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం కూడలి నుంచి ఎచ్చెర్ల వరకు రింగ్ రోడ్డు, కొయ్యాం, బడివానిపేట రోడ్డు గోతులమయంగా మారింది. కొత్తపేట, ముద్దాడ, కొంగరాం, వెంకటాపురం, ఎస్ఎంపురం, కేశవరావుపేట, ఆర్‌జేయూకేటీ క్యాంపస్‌కు వెళ్లే రహదారుల్లో గోతులు ఏర్పడ్డాయి. పొన్నాడ, ధర్మవరం అనుబంధ గ్రామాల రోడ్డులు సైతం చిత్తడిగా మారాయి.
- రణస్థలం మండలంలోని కమ్మశిగడాం, దేవరాపల్లి, వెంకటరావుపేట, నాగంపాలెం రోడ్డులు పూర్తిగా పాడయ్యాయి.
- లావేరు మండలంలో బెజ్జిపురం, గురుగుబెల్లి, పట్టుపాలెం, వేణుగోపాలపురం గ్రామాల్లో రోడ్డులు గోతులమయంగా మారాయి.
- జి.సిగడాం మండలంలో పాలఖండ్యాం, నిద్దాం, నక్కపేట, సంతఉరిటి, విజయరాంపురం, గద్దకంచరాం గ్రామాల్లో రోడ్డులు పూర్తిగా పాడయ్యాయి. కొన్ని రోడ్డులకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా ప్రస్తుతం పనులు మాత్ర ప్రారంభం కాలేదు. ఈ రోడ్డుల మరమ్మతుల కోసం ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.



బురదమయంగా లావేటిపేట రోడ్డు



గోతులమయంగా ఎస్ఎంపురం రోడ్డు

### ఇబ్బంది పడుతున్నాం



రోడ్డులు ప్రధాన సమస్యగా ఉన్నాయి. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. మట్టి రోడ్డులు మరమ్మతులు చేయాలి. కాలేజీలు, పాఠశాలలకు విద్యార్థులు సైకిళ్లపై వెళ్లుందుకు పాట్లు పడావల్సి వస్తుంది. వాహనచోదకులు, విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని రోడ్డులు నిర్మించాలి.

– మెట్ట ధనుంజయరావు, ఎస్ఎంపురంపేట

### నిర్వహణపై దృష్టి పెట్టాలి



మండలంలోని కీలకమైన రింగ్ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలి. వర్షాలకు పూర్తిగా రోడ్లు పాడయ్యాయి. మరోపక్క తారు రోడ్డుపై నీరునిలిచి పోవటం వల్ల పాడైంది. అవసరం మేరకు అంచనాలు రూపొందించి మరమ్మతులు చేయాలి.

– నేతింటి యమున, పొన్నాడ, గ్రామ సర్పంచ్

## గ్రామ సభలను విజయవంతం చేయాలి



జి.సిగడాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ నిశ్చెల



రణస్థలం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి

రణస్థలం: మండలంలోని 34 పంచాయతీల్లో శుక్రవారం నుంచి చేపట్టనున్న గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సభ్యులకు గ్రామ సభల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధికి తొడ్పడే అంశాలపై గ్రామ సభల్లో తీర్మానం చేయాలన్నారు. ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఏపీఓ శ్రీనివాసనాయుడు, ఏపీఎం రత్నం పాల్గొన్నారు.

**సమర్థవంతంగా నిర్వహించాలి..**

జి.సిగడాం: గ్రామ సభలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ నిశ్చెల అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సంకష్ట హర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయగణపతి ఆలయంలో సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగింది. అర్చకులు పెంట సూర్యనగేష్ శర్మ, శ్రీధర్‌శర్మల ఆధ్వర్యంలో రజిత వినాయకునికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: స్కూటీ ఢీకొని మహిళ గాయపడింది. ఈ సంఘటన నగరంలోని పాలకొండ రోడ్డు యాక్సిస్‌బ్యాంకు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో భూపాలరావు వీధికి చెందిన అంధవరపు రేణుక గాయపడింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### విగ్రహ ఏర్పాటుకు రూ. 1.5 లక్షల విరాళం

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురం గ్రామంలో గ్రామదేవత నిమ్మాసినమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నారు. అమ్మవారి విగ్రహం ఏర్పాటు కోసం కంచిలికి చెందిన కొత్తకోట శేఖర్ కుటుంబ సభ్యులు తన తండ్రి దివంగత నేతాజీ జ్ఞాపకార్థం రూ. 1.5 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఆర్.సి.పురం గ్రామస్తులు దొక్కరి బలరాం, గణప పాపారావు, కొల్లి మల్లేశ్వరరావు, కలియా క్రిష్ణ ఉన్నారు.

## ఆహారం వితరణ



ఆహారాన్ని పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఆహారాన్ని వృథా చేయవద్దని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు. వేడుకలు, శుభకార్యాల సమయంలో ముందుగా వేసుకున్న అంచనా మేరకే ఆహారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. పొందూరులోని ఒక కుటుంబ గృహ ప్రవేశం సందర్భంగా తయారు చేసిన ఆహారాన్ని నగరంలోని సుమారు 300 మందికి ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ద్వారా గురువారం అందజేశారు. అలాగే భైరిపురం గ్రామానికి చెందిన ఒక కుటుంబ వేడుకలో మిగిలిన ఆహారాన్ని సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ద్వారా సుమారు 100 మందికి అందించామన్నారు. పేదలకు ఆహారాన్ని అందించాలన్న, శుభ కార్యాల్లో మిగిలిన ఆహారాన్ని పంచిపెట్టాలన్నా 87909 44902, 97016 98408, 90301 32877 నంబర్లను సంప్రదించాలని కోరారు. అన్న వితరణ కార్యక్రమంలో ఉర్లం శివతేజ, నంది ఉమా శంకర్, పొడుగు చరణ్, ఐ.వి.ఆర్. హర్ష, అల్లాడ నవీన్, తవుడు పాల్గొన్నారు.

## డాక్టర్ ముత్యానికి జనజాగృతి నివాళి



మాట్లాడుతున్న డాక్టరు కుమార్‌నాయక్

పలాస: శ్రీకాకుళం ఉద్యమ సాహిత్య ఉద్యమ చరిత్ర గ్రంథ రచయత, పరిశోధకుడు, ప్రసిద్ధ కవి డాక్టర్ ముత్యం మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కాశీబుగ్గలో గురువారం బహుగ్రంథకర్త డాక్టర్ ముత్యం సంతాప సభను జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో జనాలను జాగృతి పరిచే విధంగా మంచి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. జిల్లాతో ముత్యానికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ ఆయన స్మృతి పథంలో ఒక కవితను జనజాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి వినిపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ జానపద కళాకారుడు, సినీ నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# తీరం వెంబడి కొత్త అందాలు



బీచ్ రోడ్డులో కొలువైన మత్స్యనారాయణ స్వామి విగ్రహం



బీచ్‌కు వెళ్లే మార్గంలో వివిధ దేవతా విగ్రహాలు



పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు

తీరం వెంబడి కొత్త అందాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండల పరిధి కుందువానిపేట గ్రామం వెంబడి కిలో మీటరు దూరంలో గల సముద్ర తీరాకి వెళ్లే మార్గంలో స్థానిక సర్పంచ్ కోరాడ సూర్యం సొంత నిధులతో వివిధ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే బీచ్‌కు వచ్చేవారు సేదదీరేందుకు వీలుగా వాల్ కుర్చీలను సమకుర్చారు. దీంతో ఇక్కడకు వచ్చేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీకాకుళం రూరల్

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన దామోదరరావు



జగన్‌మోహన్‌రెడ్డితో దామోదరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది పిట్టా దామోదరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులతో జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయనను దామోదరరావు కలిసి జిల్లా పరిస్థితులు, ఇటీవల జిల్లాలో జరిగిన న్యాయపరమైన అంశాలపై మాట్లాడారు.

## మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం



ఎచ్చెర్లలో పంపిణీకి సిద్ధం చేస్తున్న మొక్కలు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యా సంస్థల్లో, చెరువు గట్లపై మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు ఎచ్చెర్ల ఉపాధి హామీ పథకం ఏపీఓ శోభాదేవి చెప్పారు. ఉపాధి హామీ కార్యాలయంలో మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలకు మునగ మొక్కలు, చిలకపాలెం, కేశవరావుపేట, అల్లినగరం గ్రామాల్లో చెరువు చుట్టూ నాటేందుకు కొబ్బరి మొక్కలు అందజేయనున్నట్లు వివరించారు. శుక్రవారం మండలంలో అన్ని గ్రామాల సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి, ఉపాధి హామీ పనులు నిర్వహణకు అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

## 'గురు'తర బాధ్యతగా..



రోడ్డుపై కంకరను ఒక చోటకు చేర్చిన మాస్టారు రామరావు



రొడ్డు ప్రక్కకు కంకరను తోస్తున్న మాస్టారు

చిత్రంలో చిప్స్ రాళ్లు తీస్తున్న వ్యక్తి కార్మికుడు కాదు. మున్సిపల్ అధికారి కూడా కాదు. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. బెజ్జిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉత్తన పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు, హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు గురువారం శ్రీకాకుళం పనిమీద వచ్చారు. డేఅండ్ నైట్ కూడలి వద్ద గల నాగావళి బ్రిడ్జిపై కంకరను తీసుకు వెళుతున్న ట్రాక్టరు చిప్స్‌ను చిందర వందరగా ఒంపుకుంటూ వెళ్లిపోయింది. దీని వల్ల వాహనదారులంతా ఇబ్బంది పడ్డారు. కానీ ఎవరూ దీన్ని తీసే ప్రయత్నం చేయలేదు. దీంతో రామారావు మాస్టారు తన బండిని పక్కకు ఆపి ఓ అట్టముక్కతో రోడ్డుపై పడిన చిప్స్‌ను చివరికంటా తుడిచి పోగు చేశారు. అటుగా వెళుతున్న మరో వ్యక్తి రామారావుకు సాయం చేశారు. గురువుగా తన సామాజిక స్పృహను చాటుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

# ఝల్లుమన్న జానపదం



మాకన్నపల్లిలో జానపద వేడుకలను ప్రారంభిస్తున్న కోరాడ లింగమూర్తి తదితరులు



కళాకారుల నృత్యప్రదర్శన

పలాస: పలాస మండలం మాకన్నపల్లిలో గురువారం రాత్రి జానపదం ఝల్లుమంది. ప్రపంచ జానపదం దినోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జానపద కళాకారులు తమ నృత్యాలు, పాటలతో హోరెత్తించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో బొడ్డపాడు జెస్సీ ఈవెంట్స్, బొడ్డపాడు ఎస్.డి.ఆర్ ఫోక్స్, కుమారి సుదీక్ష శాస్త్రీయ నృత్యాలు, మాకన్నపల్లి యువశక్తి యువజన సంఘం నృత్యాలు, నీలావతి కోలాటం, వివిధ గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు విభిన్న వేషధారణలతో ప్రజలను మైమరిపించారు. గాయకుడు ఎ.ఉదయ్‌భాస్కర్ తన పాటలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాడు. జానపదానికి ప్రాణప్రతిష్ట చేసిన ఉద్దానం గద్దకు వందనాలు తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్‌తో పాటు సిక్కోలు జానపద సాహిత్య వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, కార్యదర్శి బత్తిన రామారావు, కోశాధికారి మామిడి క్రిష్టారావు, ఉపాధ్యక్షుడు దున్న రామారావు,ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్, గొరకల లోకేశ్వరరావు, పుక్కళ్ల రాజేంద్ర, చెల్లూరి నీలకంఠం, డాక్టరు కుమార్‌నాయక్, మామిడి గణపతి, తులసయ్య,తెప్పల అప్పారావు, కోరాడ లింగ మూర్తి,దున్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ కార్డుల తొలగింపుపై నిలదీత

- సంతబొమ్మాళి మండల సమావేశం



సమావేశ వేదికపై ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి తదితరులు

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకం వేతనదారుల జాబ్ కార్డులను తొలగించడం తగదని సభ్యులు అన్నారు. సంతబొమ్మాళి పంచాయతీలో వేతనదారుల జాబ్ కార్డులను తొలగింపుపై నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను ప్రస్తావించారు. కనీసం సమాచారం లేకుండా సుమారు 100 జాబు కార్డులు ఏవిధంగా తొలగించారని సంతబొమ్మాళి సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ఉపాధిహామీ పథకం ఇన్‌చార్జి ఏపీవో మురళిని నిలదీశారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఏపీవో సమాధానం ఇచ్చారు. కీలకమైన శాఖలకు చెందిన ముఖ్య అధికారులకు బదులు కింది స్థాయి సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. దీంతో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. ఇరిగేషన్ శాఖపై సభ్యులు లేవనెత్తే అంశాలపై పూర్తి స్థాయిలో సమాధానం రాలేదు. వెలుగు అధికారులు మాట్లాడుతూ.. పీఎం ఈజీ పథకం కింద రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు సబ్సిడీపై అర్హులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. శాశ్వత భూహక్కు చట్టంపై సభ్యులు లెవనెత్తిన ప్రశ్నలకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తామని సంబంధిత సిబ్బంది చెప్పారు. 2014 నుంచి 2019 మధ్యలో నిర్మించి ఒక రూపాయి బిల్లు పడిన ఇళ్లకు సంబంధించిన వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్నట్లు హౌసింగ్ అధికారులు చెప్పారు. మత్స్యశాఖపై జరిగిన చర్చలో భావనపాడు ఫిషింగ్ హార్బర్ వద్ద ఏర్పడిన ఇసుక మేటలకు ప్రత్యేకంగా బ్రేక్ వాటర్ పనులు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లమని మత్స్యశాఖ అధికారి ధర్మారాజు పాత్రో తెలిపారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఎరువులు, డీఏపీలు అందుబాటులో లేవని సభ్యులు నిలదీశారు. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు వ్యవసాయ అధికారి సురేష్ సమాధానం ఇస్తూ మూడు రోజుల్లో పైఅధికారులతో మాట్లాడి అందుబాటులోకి తెస్తామన్నారు.